సాక్షి చిత్తూరు

గురువారం । 11 । మే । 2023



మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. పెనుమూరులో చేయూత మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. -8లో



పక్కాగా 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్యశాఖపై సమీక్షించారు. -8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	26
తిరుపతి	40	27
తిరుమల	35	23
గూడూరు	40	28
నగరి	41	27

న్యూస్‌రీల్

స్టాంపుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

తిరుపతి అర్బన్: నాన్ జుడీషియల్ స్టాంపులను కృత్రిమ కొరత సృష్టించినా.. అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖ డీఐజీ(డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్) పి.గిరిబాబు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పది, ఇరవై, యాభై, వంద విలువ కలిగిన అన్ని స్టాంపులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. మరోవైపు స్టోక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెట్ వారు తమ అధీకృత కేంద్రాల్లో ఈ–స్టాంప్ పేపర్లు, స్టాంప్ డ్యూటీ చెల్లింపులు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. నాన్ జుడిషియల్ స్టాంప్ పేపర్ల స్థానంలో ఈ స్టాంప్ పేపర్లు ఉపయోగించవచ్చని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా పరిధిలో 46 అధీకృత కేంద్రాలు, తిరుపతి జిల్లా పరిధిలో 48 అధీకృత కేంద్రాల్లో ఈ–స్టాంప్స్‌ను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

15న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకలను ఈ నెల 15న సోమవారం లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో కానుకల లెక్కింపు ఉంటుందని, ఆలయ అధికారులు, సిబ్బంది అంతా హాజరు కావాలని కోరారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం సేవ



కాణిపాకం ఆలయాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం తిరుమంజనం సేవను ఆలయ అధికారులు, అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి బుధవారం తిరుమంజనం సేవ నిర్వహిస్తారు. అందులో భాగంగా సాయంత్రం ఆలయ ప్రాకార మండపం, నవగ్రహ మండపం, గణపతి హోమం మండపం, షోడశ గణపతుల దగ్గర ఆలయాన్ని శాస్త్రోక్తంగా శుద్ధి చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు, శానిటర్ ఇన్‌స్పెక్టర్ తిరుమలగిరి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి ఉండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణ స్వామి, పుష్పమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పలు కోర్టులకు ఇన్‌చార్జ్ జడ్జిలు

చిత్తూరు అర్బన్: జిల్లాలోని పలు న్యాయస్థానాలకు ఇన్‌చార్జ్ జడ్జిలను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రమేష్‌కు అదనంగా మదనపల్లెలోని 2, 7వ అదనపు జిల్లా న్యాయస్థానాల బాధ్యలను అప్పగించింది. చిత్తూరు 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవికి పీలేరులోని 11వ అదనపు జిల్లా కోర్టు, చిత్తూరులోని 9వ అదనపు జిల్లా కోర్టు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చిత్తూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతికి 6వ అదనపు జిల్లా కోర్టు, మహిళలపై జరిగే దాడుల విచారణ కోర్టు బాధ్యతలను అప్పగించారు.

ఏపీ పథకాలు.. బీజేపీ కాపీ

- ఏపీ సంక్షేమ పథకాలను చూసే ఎన్నికల హామీలు
- మన పథకాలను అధ్యయనం చేస్తున్న ఇతర రాష్ట్రాలు, దేశాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఎల్లో మీడియా విషపు రాతలు
- రాష్ట్ర విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు: సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు/చౌడేపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాలను చూసి బీజేపీ, ఇతర పార్టీలు కూడా కాపీ కొడుతూ మన విధానాలను అమలుపరుస్తామని ఎన్నికల హామీలు ఇస్తున్నాయని రాష్ట్ర విద్యుత్, అటవీ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డితో పాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సచివాలయాలు, ఆర్బీకేలు ఏర్పాటు చేసి ఒక్కసారిగా సుమారు 4 లక్షల మందికి అవినీతికి తావులేకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఇదే విధానాన్ని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి, స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. పలు దేశాలు, రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి మన వ్యవస్థలు, పథకాలపై అధ్యయనాలు చేస్తున్నాయని తెలిపారు. చంద్రబాబునాయుడు రుణాలు మాఫీ అంటూ మహిళలను, రైతులను మోసగించారన్నారు. ఆయన ఎన్నికల మేనిఫెస్టోను కూడా దాచేశారని ఎద్దేవా చేశారు. పదినెలల తరువాత ఎన్నికలు రాబోతున్నాయని, ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించాలని కోరారు. రెండోసారి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెట్టింపు మేలు చేస్తారని, దీన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, పీకెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఎంపీపీ అక్కిసాని భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియావి విషపురాతలు

అయితే ఈసారి చంద్రబాబునాయుడును ఎలాగైనా సరే అధికారంలోకి తేవాలని ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఈటీవీ ఏబీఎన్ చానల్, పత్రికలు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొండంత మేలు చేసినా గోరంత కూడా ఎవరికీ చెప్పుకోలేదన్నారు. చంద్రబాబు నాయుడు గోరంత చేస్తే కొండంత రాసే పత్రికలు, చానల్స్ నిజాలు దాచిపెట్టి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. మూడేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి 14 ఏళ్లుగా సీఎంగా ఉన్న చంద్రబాబు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అమరావతి పేరుతో గ్రాఫిక్స్ చూపించి ఎల్లో మీడియా ద్వారా ప్రజలను మోసం చేశారన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో ప్రపంచ రాజధాని అన్నట్లు అమరావతిని ప్రచారం చేశాయన్నారు. అందుకే మన ప్రజలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నేతలు కలిసి మన ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధి పొందారని, ఇళ్లు సైతం మంజూరు చేయించామన్నారు. ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

నా తరఫున మీరే చేయాలి..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సుమారు 64 నియోజకవర్గాల్లో పార్టీ బాధ్యతలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇలాంటి సమయంలో నా తరఫున ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు, గృహసారథులు, కన్వీనర్లు, తన శ్రేయోభిలాషులు కష్టపడి పనిచేయాలని మంత్రి పెద్దిరెడ్డి కోరారు.

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక

- తెలుగు యువత మండలాధ్యక్షుడు హరీష్‌తో పాటు పలువురి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు హరీష్, రాధాపతి

చౌడేపల్లె: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చౌడేపల్లె మండల తెలుగు యువత అధ్యక్షుడు హరీష్‌తో పాటు పలువురు సీనియర్ టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు అండే రాధాపతి, సున్నా భాస్కర్, కుమార్ చేరారు. వీరితోపాటు వారి అనుచరులకు మంత్రి పెద్దిరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ కాలనీ, గోసలకురప్పల్లె ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు పార్టీలో చేరారు. పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు నమ్మిన వారిని పెద్దిరెడ్డి కుటుంబం ఆదుకున్న తీరును చూసి పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామ్మూర్తి, సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ అంజిబాబు, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, రాధాకృష్ణ, కల్యాణ్, వరుణ్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మను దర్శించుకున్న మంత్రి పెద్దిరెడ్డి



ఆలయం వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రి

సదుం: ఎర్రాతివారిపల్లెలో వెలసిన సదుం ఎల్లమ్మను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం దర్శించుకున్నారు.ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, నేతలు మనోహర్ రెడ్డి, సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తే కఠిన చర్యలు

- మే 10 నుంచి 20వ తేదీ వరకు మామిడికి మద్దతు ధర రూ.19
- క్యాల్షియం కార్బొనేట్ వాడినట్లు తెలిస్తే తీవ్రంగా పరిగణిస్తాం
- ర్యాంపుల వద్ద కచ్చితమైన తూకం వేయాలి
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : మామిడి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. చిత్తూరు జిల్లాకు గుర్తింపు తెచ్చింది మామిడి పంటే అని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మామిడి కోత మొదలైంది గనుక ప్రభుత్వం తరఫున రైతులకు పెట్టుబడికి తగిన ఫలితం అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులు మామిడి పంటను దశల వారీగా కోత కోయాలని కలెక్టర్ తెలిపారు. గతంలో ఉన్న సమస్యలను బేరీజు వేసుకుని క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ర్యాంపుల వద్ద రైతులను మోసం చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని కట్టడి చేసేందుకు ప్రభుత్వ సిబ్బందిని నియమించామన్నారు. అక్కడ పరిశీలించాల్సిన విషయాలపై సిబ్బందికి లీగల్ మెట్రాలజీ అధికారులతో శిక్షణ ఇప్పించామని తెలిపారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే ర్యాంపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మామిడి పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు వినియోగించే క్యాల్షియం కార్బైట్‌ను బ్యాన్ చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా వినియోగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్దతు ధర రూ.19

మే 10 వ తేదీ నుంచి మే 20వ తేదీ వరకు జిల్లాలో మామిడి మద్దతు ధర రూ.19లుగా కలెక్టర్ ప్రకటించారు. ఈ ధర అన్ని ఫ్యాక్టరీలలో అమలు చేసేలా చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారులను ఆదేశించారు. 20వ తేదీ తరువాత సమావేశం నిర్వహించి తదుపరి మద్దతు ధరను ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధరను రైతులు, కొనుగోలుదారుల సమక్షంలో నిర్ణయించామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మామిడి 54,370 హెక్టార్లలో (1,36,000 ఎకరాల్లో) సాగులో ఉందన్నారు. దాదాపు 68 వేల మంది రైతులు మామిడిని సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి అన్ని డివిజన్లలో రైతు భరోసా కేంద్ర సిబ్బందికి మామిడి కోతలపై శిక్షణ కల్పించి, వారి ద్వారా రైతులకు అవగాహన కల్పించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి మధుసుధారెడ్డి, పండ్ల పరిశ్రమ సమాఖ్య నాయకులు గోవర్ధన్ బాబీ, శివకుమార్ తదితర రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం..

ప్రజా సమస్యలను పరిష్కరానికి అధికారులు మరింత బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ప్రభుత్వం స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోందని, కార్యక్రమంలో ముఖ్యమంత్రి పేరును చేర్చడం వల్ల జిల్లా యంత్రాంగంపై మరింత బాధ్యత ఏర్పడిందన్నారు. ప్రజలు తమ సమస్యలను, సూచనలను 1902 నంబర్‌కు కాల్ చేసి చెప్పవచ్చన్నారు. సీఎంఓ పరిధిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఫిర్యాదులను పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమం అమలు కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్పందనలో సమస్యలను పరిష్కరించడంలో చిత్తూరు జిల్లా ప్రతి నెలా రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో ఉంటోందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ–స్టాంప్ విధానంతో సులభంగా రిజిస్ట్రేషన్లు

- స్టాంప్ పేపర్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించవచ్చు
- డీఐజీ గిరిబాబు



ఈ–స్టాంప్ పేపర్‌ను చూపుతున్న డీఐజీ గిరిబాబు, డీఆర్ శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్ శాఖలో సులభతరంగా, వేగవంతంగా సేవలు అందించడానికి ఈ–స్టాంప్ విధానం తీసుకొచ్చామని, నాన్ జ్యుడీషియల్ పత్రాల స్థానంలో ఈ–స్టాంప్ విధానం ప్రత్యామ్నాయంగా వాడవచ్చని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ(డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్) గిరిబాబు తెలిపారు. ఆయన బుధవారం డీఆర్ (డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్)శ్రీనివాసరావుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. చిత్తూరు 46, తిరుపతి జిల్లాలో 48 కేంద్రాల్లో ఈ–స్టాంప్ పత్రాలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ–స్టాంప్ పత్రాల కొనుగోలు అనంతరం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు చెల్లించిన డ్యాకుమెంట్‌తో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రభుత్వం ఈ సేవలను అమలు చేస్తోందని, ఇందుకోసం బ్యాంకులు, సీఎస్‌సీ, ఈసేవా కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. జిల్లాల్లో స్టాంప్ పేపర్స్ అందుబాటులో ఉన్నాయని, అధిక ధరలకు పత్రాలను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు చేస్తే, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

టీటీడీ నూతన న్యాయాధికారిగా వీర్రాజు

తిరుమల: టీటీడీ న్యాయాధికారిగా వై.వీర్రాజు బుధవారం రంగనాయకుల మండపంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వీర్రాజును టీటీడీ ఈవో ధర్మారెడ్డి లడ్డూ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.



టీటీడీ న్యాయాధికారి వీర్రాజుకు లడ్డూ ప్రసాదాలను అందజేస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

రాష్ట్ర ప్రజల సుభిక్షం కోసం మహాయజ్ఞం

- విజయవాడలో ఆరు రోజుల పాటు నిర్వహణ
- కాణిపాకం నుంచి ధర్మప్రచార రథం
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి

కాణిపాకం (యాదమరి): రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో విజయవాడలో ఆరురోజుల పాటు మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం కాణిపాకం ఆలయం వద్ద అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సమస్త రాష్ట్ర ప్రజల శాంతి సౌభాగ్యాల కోసం, పాడి పంటలు సమృద్ధి, ప్రకృతి మాత అనుగ్రహం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేవదాయ శాఖ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 12వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాయజ్ఞానికి కాణిపాక ఆలయం నుంచి ధర్మప్రచార రథం, అర్చక వేదపండితులు, సన్నాయి, డోలు పంపనున్నట్లు వివరించారు. స్వామివారి భక్తులు అందరు హాజరు కావాలని ఆయన కోరారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి మాట్లాడుతై ఇలాంటి కార్యక్రమాలు ఇప్పటి వరకు ఎవరూ చేపట్టలేదని, రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టడం చాలా సంతోషకరమన్నారు. ఆలయ ఈఓ వెంకటేశు మాట్లాడుతు ఇలాంటి మహాయజ్ఞలు చేయడం వల్ల దైవభక్తి పెరగడమే కాకుండా హింధుధర్మ రక్షణతోపాటు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, మాజీ ఆలయ ఈఓ కేశవులు, ఆలయ అర్చక వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా కేరింత

గంగమ్మ తల్లి.. వెంకన్న చెల్లి.. జాతరో జాతర.. వేషాలు వేయరా.. మొక్కులు తీర్చరా... అమ్మ కరుణను పొందరా అంటూ తిరునగరిలో బుధవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర సంబరాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంటి నుంచి కుటుంబ సమేతంగా తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పణకు శ్రీకారం చుట్టారు.

- వేడుకగా తాతయ్యగుంట గంగమ్మ జాతర సంబరాలు ప్రారంభం
- సంప్రదాయబద్ధంగా సారె సమర్పించిన ఎమ్మెల్యే భూమన కుటుంబం
- జానపద కళా ప్రదర్శనలతో పులకించిన పురవీధులు



గంగమ్మకు సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే భూమన



జాతరకు విచ్చేసిన జనసందోహం

తిరుపతి కల్చరల్: డప్పుల దరువులు, పంబల మోత, మంగళవాయిద్యాలతో గంగమ్మ సారె ఊరేగింపు ఆడంబరంగా సాగింది. నవదుర్గలు, కాంతార, తీన్‌మార్, కొమ్ము కొయ్య నృత్యాలు, దింసా, పగటి వేషాలు, పులివేషాలు, గరగల్లు, బోనాలు, కీలుగుర్రాల ఆటలు, తప్పెట గుళ్ల మోతలు, కోయ నృత్యాలు, కోలాట భజనలు, పిల్లన గ్రోవి వంటి 36 రకాల జానపద కళా ప్రదర్శన సందడితో సారె యాత్ర హోరెత్తింది. వివిధ దేవతామూర్తులు, అమ్మవారి విశ్వరూప కళా ప్రదర్శనలు, లయబద్ధ నృత్యాల హోరుతో తిరుపతి పురవీధులు పులకించాయి.

సంప్రదాయబద్ధంగా సారె పూజ

తొలుత పద్మావతిపురంలోని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇంట్లో సారె పూజను సంప్రదాయంగా నిర్వహించారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ డి.సరిత, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లా ఎస్పీలు పరమేశ్వరరెడ్డి, రిషాంత్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమన దంపతులు, డెప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి దంపతులు, భూమన కుటుంసభ్యులు సారెను శిరస్సుపై పెట్టుకుని భక్తి శ్రద్ధలతో శోభాయాత్రగా ఆలయానికి బయలుదేరారు.

వెల్లివిరిసిన సామరస్యత

నగరంలో ముస్లింలు గంగమ్మసారె పట్ల చూపిన భక్తిభావం సామరస్యతను చాటింది. డీఆర్ మహల్ వద్ద స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ముస్లిం మహిళలు సారెకు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా వివిధ పార్టీ నేతలు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు, ప్రజలు, ఏఐటీయూసీ నేతలు సారెతో సాగుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డిని పుష్పాలు, శాలువలతో ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

బాలిక అదృశ్యం

పుంగనూరు: పట్టణానికి చెందిన ఓ బాలిక మంగళవారం నుంచి కనిపించడం లేదని ఆ బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ మోహన్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.

అనుమానాస్పద స్థితిలో మేస్త్రీ మృతి

ఏర్పేడు: మండలంలోని ఏర్పేడు-బండారుపల్లి రోడ్డులో మీల్ కర్మాగారం వద్ద బుధవారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ఆయన కథనం మేరకు.. నెల్లూరు జిల్లా, ఆత్మకూరు మండలం, బోయల సిరిసిల్ల గ్రామానికి చెందిన మేస్త్రీ సూరం శ్రీనివాసులురెడ్డి(42) పనుల కోసం మంగళవారం మండలంలోని కోబాక గ్రామానికి వెళ్లాడు. బుధవారం ఏర్పేడు-బండారుపల్లె రోడ్డులోని మీల్ కర్మాగారం వద్ద ఓ కానుగ చెట్టు కింద శ్రీనివాసులురెడ్డి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- సంక్షేమ పథకాలతో అక్కచెల్లెమ్మలకు లబ్ధి చేకూరుస్తున్నాం
- చేయూత మహిళా మార్ట్ మరింత అభివృద్ధి చెందాలి
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం పెనుమూరులో స్వయం సహాయక సంఘాల మహిళలచే నూతనంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్ షణ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందులో భాగంగానే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకు రుణాలను ప్రభుత్వం విరివిగా అందిస్తోందన్నారు.

మార్ట్ మరింత అభివృద్ధి చెందాలి..

స్వయం సహాయక సంఘాల మహిళలచే నడుపబడుతున్న ఈ చేయూత మహిళా మార్ట్ మరింత అభివృద్ధి చెంది ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ షణ్మోహన్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం రిలయన్స్, ఐటీసీ, అమూల్ లాంటి పెద్ద కార్పొరేట్ సంస్థలతో సంప్రదించి మహిళా మార్ట్‌లకు చేయూత అందించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం ఇదే కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి పాల్గొని మహిళల ఆధ్వర్యంలో మార్ట్‌ను ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మార్ట్‌లు ఏర్పాటు చేయడం వల్ల నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకే ప్రజలకు అందుతాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు సాయం అందించకుండా, మహిళలను మోసం చేసి మరింత ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, ఎంపీడీఓ శివయ్య, జెడ్పీటీసీ దొరస్వామి యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గోవిందరెడ్డి, ఎంపీటీసీలు యశోదారెడ్డి, అరుణ, సుభాషిణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అర్థం తెలుసా బాబు ?



గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : చంద్రబాబుకు, వర్లరామయ్యకు అభివృద్ధి అంటే అర్థం తెలుసా...? మీరు ఎప్పుడైనా ఇలాంటి అభివృద్ధి చేశారా ? అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రశ్నించారు. బుధవారం ఆయన గంగాధరనెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నంత కాలంలో ప్రజల గోడును పట్టించుకోని చంద్రబాబు, అతని కొడుకు లోకేష్ నేడు రోడ్లపై పొర్లు దండాలు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ×జగనన్నకు చెబుదాం× కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. దీన్ని డీజీపీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్యవేక్షిస్తారని తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 5 రోజులకే నగదు జమ చేసిన ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని అన్నారు. ఒక్కరోజే 32,558 మంది రైతులకు రూ.474 కోట్లు జమ చేసిన ఘనత మా ప్రభుత్వానిదేనని అన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.78,000
రిటైల్ వెండి గ్రాము	రూ.80

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.5.87 లక్షలు విరాళం


ఆలయ అధికారులకు చెక్‌ను అందిస్తున్న దాత సోముఆనందపిళ్లై కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.5.87 లక్షల విరాళం చెక్‌ను చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేటకు చెందిన సోముఆనందపిళ్లై ఆలయ ఈఓ వెంకటేశుకు అందించారు. బుధవారం దాత కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. వీరికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. అనంతరం దాత ఆలయ ఈఓకు ఈ విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట రైల్వే స్టేషన్ రెండవ ప్లాట్ ఫాం వద్ద బుధవారం తెల్లవారుజామున రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. స్టేషన్ మేనేజర్ ధిరేంద్రకుమార్ సమాచారం మేరకు జీఆర్పీ ఎస్‌ఐ జి.మాలకొండయ్య మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 30 ఏళ్లు ఉంటాయి. పసుపు రంగు గీతలు కలిగిన బనియన్, షార్ట్ ధరించి ఉన్నాడు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

– కిలో గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఓ వ్యక్తి రహస్యంగా గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం అందడంతో స్థానిక పోలీసులు బుధవారం అతన్ని అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 4వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'గంజాయి మత్తులో యువత' అనే శీర్షికపై స్పందించిన పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి పట్టణంలో గంజాయి విక్రయాలపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని సీఐ చంద్రశేఖర్‌కు ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీఐ తన సిబ్బందితో కలసి పక్కా సమాచారంతో గుండుబావి ప్రాంతంలో మండలంలోని ముసలిమొడుగుకు చెందిన బాలాజీ(37)ని పట్టుకున్నారు. ఇతను తన పొలం వద్ద రహస్యంగా గంజాయి మొక్కలను సాగు చేస్తూ వాటి ఆకులను ఎండబెట్టి పట్టణంలోని డానియల్ అలియాస్ షబ్బీర్‌కు విక్రయించేవాడని విచారణలో తేలింది. దీంతో నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఇందులో ఎస్‌ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వండి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి కరుణకుమార్

చిత్తూరు కలెక్టరేట్ : వయోవృద్ధులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల కోసం ప్రత్యేక చట్టాలు, హక్కులు ఉన్నట్లు తెలిపారు. తల్లిదండ్రులను, వయోవృద్ధులను భారంగా భావించకుండా వారికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డీఆర్వో రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు వృద్ధాశ్రమాలు ఉండేవి కావన్నారు. నేటితరం పిల్లలకు స్కూళ్లలో, కళాశాలల్లో కుటుంబ విలువలు, తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణ, వారి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 1,44,244 మందికి నెలకు ఒక్కొక్కరికి రూ.2750 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ అందజేస్తోందన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం డివిజన్ స్థాయిలో ఆర్డీఓల సమక్షంలో, జిల్లాస్థాయిలో కలెక్టర్ సమక్షంలో జరిగే అప్పిలేట్ సమావేశాల్లో తగు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు అనేకమంది వృద్ధులను ఆదుకుంటున్నారని చెప్పారు. జిల్లాలోని వృద్ధాశ్రమాల్లో 1575 మందికి సేవలు లభిస్తున్నాయని వివరించారు. డీసీహెచ్‌ఎస్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వృద్ధులకు వైద్యసేవలను ఇంటి వద్దనే అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తిరుపతి రాస్ స్వచ్ఛంద సేవాసంస్థ నుంచి యువరాజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్


నిందితుడ్ని అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని చిత్తూరు సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లె వద్ద సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు ఆధ్వర్యంలో సెబ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. మొగిలివారిపల్లెకు చెందిన టి.లోకేష్ (27) అనే వ్యక్తి 96 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను విక్రయిస్తుండగా అతన్ని అరెస్టు చేశారు. నిందితున్ని మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

గృహాల క్రమబద్ధీకరణకు అవకాశం


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రప్రభుత్వం ఆక్షేపణ లేని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు వాటి క్రమబద్ధీకరించుకోవడానికి కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆక్షేపణ లేని ప్రభుత్వ భూముల్లో (2019 అక్టోబర్15 పూర్వము లేదా 2019 అక్టోబర్ 15) నాటికి ఆక్రమణలో గల నివాస గృహాలు (500 చ.గజాల) క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు అవకాశం కల్పించిందన్నారు. అర్హత ఉన్న వారు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రభుత్వ జీఓ 225 ప్రకారం..

కింద కనబరచిన ప్రకారం ఆక్షేపణ లేని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను క్రమబద్ధీకరణ చేస్తామని జేసీ శ్రీనివాసులు వివరించారు. 100 చదరపు గజాల విస్తీర్ణం వరకు (కేటగిరీ 1 కింద ఉంటే ఉచితంగా డీ-ఫారం పట్టా ఇవ్వబడును, రెగ్యులైజేషన్ తర్వాత 10 ఏళ్ల పాటు అన్యాక్రాంతం చేసే హక్కులు లేకుండా), 101 నుంచి 200 చ.గజాల వరకు భూమి 50 శాతం బేసిక్ ధర, 201 నుంచి 300 వరకు భూమి 100 శాతం బేసిక్ ధర, 301 నుంచి 500 వరకు భూమి 1.5 శాతం బేసిక్ ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు చేసుకున్న తరువాత సంబంధిత తహసీల్దార్ విచారణ జరిపి ఆమోదం కోసం ఆర్డీఓ, టౌన్ ప్లానింగ్ అధికారి/మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్/మున్సిపల్ కమిషనర్‌తో ఏర్పాటైన సబ్‌డివిజనల్ అప్రూవల్ కమిటీలో ప్రవేశ పెడతారన్నారు. ఆ కమిటీకి వచ్చిన దరఖాస్తులపై 30 రోజుల్లోపు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కమిటీ నిర్ణయంతో విభేదించిన వారు తిరిగి జేసీ వద్ద అప్పీలు చేసుకోవచ్చని తెలిపారు. ఆ తర్వాత అప్పీలుకు అవకాశం ఉండదన్నారు. ఆమోదం పొందిన దరఖాస్తుకు సంబంధించిన తహసీల్దార్ నిర్ణయించిన ధరను, రిజిస్ట్రేషన్ ధరను ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. ఆ తరువాత జీఓ 225 ప్రకారం దరఖాస్తుదారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారని జేసీ వెల్లడించారు.

దివ్యాంగులకు ఆత్మస్థైర్యమే ఆయుధం


త్రివీలర్ స్కూటీలను దివ్యాంగులకు అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి
- మంత్రి ఆర్‌కే రోజా
- విభిన్న ప్రతిభావంతులకు, వయోవృద్ధులకు త్రివీలర్ స్కూటీల పంపిణీ

నగరి:దివ్యాంగుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ నుంచి రాష్ట్రప్రభుత్వం అందించిన త్రివీలర్ స్కూటీలను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నియోజకవర్గానికి పది స్కూటీలు చొప్పున 175 నియోజకవర్గాలకు 1,750 స్కూటీలను అందించిందన్నారు. జీవితంలో ఎదుగుదలకు అంగవైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యమే దివ్యాంగులకు ఆయుధమన్నారు. దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా నాడు వైఎస్సార్, నేడు జగనన్న మాత్రమే వారికి తగిన తోడ్పాటును అందిస్తున్నారన్నారు. మానసిక ధైర్యంతో వారు ముందడుగు వేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ పనులు తాము చేసుకోవడానికి తగిన వాహనం తమకు కావాలంటూ దివ్యాంగులు అభ్యర్థనలు చేసుకున్నారని, వారిలో పది మందికి నేడు వాహనాలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, సీఆర్‌ఓ రాజశేఖర్, సంస్థ అధికారులు, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికను వంచించి..

- వరుసకు తండ్రి అయ్యే వ్యక్తి లైంగిక దాడి
- ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భవతి
- నిందితున్ని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

పలమనేరు: వరుసకు తండ్రి అయ్యే వ్యక్తి ఓ బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన ఘటన పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని నీళ్లకుంటలో బుధవారం వెలుగుచూసింది. నీళ్లకుంట గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆ బాలికను అదే గ్రామానికి చెందిన ఆమె పినతండ్రి గత ఏడాదిగా పలుమార్లు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడినట్టు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం బాలిక ఎనిమిది నెలలు గర్భంగా ఉండడంతో స్థానిక ఐసీడీఎస్ అధికారులు వైద్యం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసి నీళ్లకుంట గ్రామస్తులు నిందితుడిని పోలీసులకు అప్పగించినట్టు తెలిసింది. జరిగిన సంఘటనపై పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నలుగురు కోడిపందెం రాయుళ్ల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

- 12 బైక్‌లు, కారు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం
- రూ.1.50 లక్షల పందెం కోళ్ల పట్టివేత


స్వాధీనం చేసుకున్న పందెంకోళ్లు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంటపల్లె సమీపంలో కోడి పందెం స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. వారి నుంచి రూ.2 వేల నగదు, 12 బైక్‌లు, కారు, 4 సెల్‌ఫోన్లు, రూ.1.50 లక్షల విలువైన పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం కోడిపందెం స్థావరంపై దాడులు చేశామన్నారు. కొందరు పరారయ్యారని, వారి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. నలుగురు నిందితులను పుత్తూరు కోర్టులో హాజరు పరిచినట్టు చెప్పారు.

పక్కాగా 'ఫ్యామిలీ డాక్టర్'ను నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : క్షేత్రస్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వైద్య, పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వల్ల మంచి ఫలితాలు వస్తున్నట్లు చెప్పారు. అలాగే అనీమియా, అండర్ వెయిట్ పిల్లలకు అలసత్వం లేకుండా చికిత్స అందించాలన్నారు. గర్భిణులకు మూడు నెలల నుంచి అత్యంత జాగ్రత్తగా చికిత్స అందించాలని తెలిపారు. వారి ఆరోగ్య పరిశీలనకు సోమవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. వైద్యులు విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి. ప్రకాశం, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ రవి రాజు, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ సంధ్య, రమేష్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ ఆస్తుల వేలం వాయిదా

బుచ్చినాయుడుకండ్రిగ: పాటదారులు రాకపోవడంతో మండలంలోని సుదలగుంట షుగర్ ఫ్యాక్టరీ భూములు, ఆస్తుల వేలం వాయిదా వేసినట్లు డిప్యూటీ కేన్ కమిషనర్ జాన్‌విక్టర్, తహసీల్దారు హనుమాన్‌నాయిక్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు బకాయిలు ఉందని, ప్రభుత్వానికి కొనుగోలు పన్ను బకాయి ఉండడంతో ఆర్‌ఆర్ యాక్టు ప్రకారం స్వాధీనం చేసుకున్న భూములు, ఆస్తులకు బుధవారం వేలంపాట నిర్వహించామన్నారు. తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ సమర్పించిన మార్కెట్ విలువతో వేలంపాట నిర్వహించినప్పటికీ పాటదారులు రాకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.